# అవసరం

-అచరా

చాలాకాలం తర్వాత మళ్ళీ సొంతవూరు వస్తుంటే రావుగారికి చాలా ఆనందంగా ఉంది. తను పుట్టి పెరిగిన వూరు. ఎస్.ఎస్.ఎల్.సి. వరకూ ఇక్కడే చదువుకున్నారు. తను చదువుకున్న రోజుల్లో తిరిగిన షికార్లూ, మామిడి తోటల్లో చొరబడి కాయల్ని దొంగతనంగా కోసి ఉప్పు కారం కలిపిన గుండలో ముంచుకొని స్నేహితులతో కలిసి తింటూ సాయం కాలాలు తోటల్లో పొలాలలో గడిపిన రోజులు గుర్తు కొచ్చాయి. తెలతెలవారుతుండగానే విశాఖ ఎక్స్‌ప్రెస్ స్టేషన్లో ఆగింది. ఊరికి స్టేషన్‌కి రెండు కిలోమీటర్లు. రిక్షాలో వస్తుంటే రోడ్డుకిరుప్రక్కలా ఉన్న దృశ్యాలు లీలగా కనిపిస్తున్నాయి. పాడుబడిపోయిన రాజుగారి బంగళా అలాగే ఉంది.

రోడ్డు మలుపు తిరిగింది. అంటే ఊరి శివార్లలోకి వచ్చామన్నమాట. రాత్రంతా ట్రైన్‌లో సరిగా నిద్రలేదు. రిక్షాలోనే కునికిపాట్లు పడుతున్న రావుగారికి ఏదో భరించరాని వాసన తగిలింది. కళ్ళు తెరిచి చూశారు. రోడ్డుకిరుప్రక్కలా అక్కడక్కడా మనుషులు కొందరు నిలబడ్డారు. కొందరు కూర్చొనే ఉన్నారు. అసహ్యం వేసింది. నాగరికత కూడా లేదు వెధవలకి అనుకు న్నారు. తన చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. అప్పుడు తారురోడ్డు లేదు. మట్టిరోడ్డు. ఇరుప్రక్కలా కూరాకుల గుడ్లు (మళ్ళు). రోడ్డుకి కుడిప్రక్కన బుచ్చిబాబుగారి తోట ఉండేది. దానిలో పెద్ద గుండం ఉండేది. ఇప్పుడు అక్కడ నాలుగు పెంకుటిళ్ళు కట్టారు. వాటి వెనుక వరుసగా పూరి గుడిసెలూ, చిన్న చిన్న ఇళ్ళూ కనిపిస్తు న్నాయి మంచులో. బహుశా కాలనీ అయి ఉంటుంది అనుకున్నారు రావుగారు.

అప్పుడు అర్థం అయింది ఇంత దుర్గంధం ఎం దుకు వస్తుందో! ఇక్కడ కాలనీ కట్టారుగదా వాళ్ళకి లావెట్రీలుండవా? తను సిటీలో ఉంటున్నాడు. లావెట్రీ లేకపోతే ఇంటి ప్లాను ఎప్రూవు కాదు. పేదలకు పక్కా గృహాల నిర్మాణం గురించి పేపర్లో చూస్తున్నారు. కాబట్టి ఈ ఇళ్ళు ఎవరు కట్టించారో ఊహించుకోగలిగారు రావుగారు. మరి ప్రభుత్వం కట్టించిన ఈ ఇళ్ళకు లావెట్రీలుండవని ఇప్పటివరకూ అతని బుర్రకి తట్టలేదు. అయ్యో పాపం, వాళ్ళందరూ తెల్లారేసరికి ఎక్కడికి పోతారు. మళ్ళీ రావుగారికి తన చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. స్కూలు నుంచి ఇంటికి వచ్చి చెంబు పట్టుకుని పార్వతీశం ఇంటికి వెళ్లడం, ఇద్దరూ కలిసి కూరాకుల గుడ్లులో కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ అరగంట వరకూ వినోదించి ఇంచికొచ్చి స్నానం చెయ్యడం అన్నీ జ్ఞాపకం వచ్చి అలవాట్లు ఎంత మారి పోయాయో అని ఆశ్చర్యపోయారు. అతనికి మరొక అనుమానం వచ్చింది. ఇప్పుడు ఎలిమెంటరీ స్కూలులో చదువుతున్న పిల్లలు ఎక్కడికి వెళ్తుంటారు. తనలాగే ఇద్దరు ముగ్గురు కలిసి వెళ్తుంటారా? పొలా ల్లోకి వెళ్తే వాటికి సత్తువ వస్తుందని ఎవరూ ఏమీ అనేవారు కాదు. ఇప్పుడు రోడ్డు ప్రక్కన కూర్చొన్న వాళ్ళని ఎంతమంది తిట్టుకుంటున్నారో? పాపం వాళ్ళు కూడా పదినిమిషాలు హాయిగా కూర్చోలేరు. కబుర్లు చెప్పుకోవడం సరే సరి. అంతా సూర్యోదయం కంటే ముందే అయిపోవాలి. లేకపోతే మానభంగం.

"సార్! ఇంటికి వచ్చేశాం" అన్న పిలుపుతో రావుగారు కళ్ళు తెరిచారు. గుమ్మం ముందు గడప మీద కాళ్ళు కడుక్కుంటున్న సరస్వతి తలెత్తి చూసింది. "రండి చిన్నాన్నా- ఇంటి దగ్గర అందరూ బాగు న్నారా?" అంటూ చెంబు లోపల పెట్టి, సంచి అందు కొంది.

కాసేపు చారబడండి. వేన్నీళ్ళు పెడతాను. స్నానం చేసి టిఫిన్ చేద్దురుగాని. పెసరట్లు వేస్తాను. మీకిష్టం గదా? అని సరస్వతి పనుల్లో మునిగిపోయింది.

రావుగారు లేచేసరికి ఎనిమిదిన్నర అయింది. జామిచెట్టు కింద స్నానం చేస్తుంటే రావుగారికి మహ దానందంగా ఉంది. ఎల్లలు లేని బాత్‌రూమ్. పైన విశాలమైన నీలాకాశం. "అమ్మాయ్.. ఇదేమిటి, ఎంత సబ్బు పెట్టినా నురగ రావడంలేదు. ఏమయిందీ నీళ్ళకి?"

"ఇవి నూతినీళ్ళు చిన్నాన్నా. చెరువుకి వెళ్ళడం లేదు. మంచినీళ్ళ చెరువు పూర్తిగా పాడయిపోయింది. గట్టుమీద అడుగెయ్యలేం, అంత చెండాలం."

"అంత ఖర్మేం వచ్చింది ఊరివాళ్ళకి. గట్టుకింద

## కాసిని నానీలు

కాలుతున్నా
పరిమళాన్ని పంచుతుంది
అగరుబత్తీ
ఓ ఆదర్శ పాఠం
    జరిగేదేదీ
    కోరుకున్నట్లు జరగదు
    బ్రతుకో
    అచ్చుతప్పుల పుస్తకం
వెదురు బొంగుకూ
ఓ రోజు వస్తుంది
జెండాకర్రై
వందనం అందుకుంటుంది
    బ్రతికుండగా ఈ నేత
    ప్రగతికి అడ్డు
    చచ్చి, విగ్రహమై
    రోడ్డుకూ అడ్డు!
సత్యాన్ని శోధిస్తున్నానంటే
నమ్మొచ్చు
సాధించానంటే మాత్రం
నమ్మనే నమ్మకు
    సాయంత్రమయ్యేసరికి
    జనం కోసం తహతహ
    అలల పరుగుతో / కడలి!
జబ్బు తగ్గించేందుగ్గాదు
బిల్లు
కాస్లీ యంత్రాలు వాడేందుకు!
కార్పొరేట్ ఆస్పత్రి!
    తొలకరి చినుకుల / కితకితలు
    నేల కన్యకు
    పసిమి పులకలు!
వాడు శ్రీశ్రీని
ఎందుకలా తిడుతున్నాడు?
తిట్టడం కాదు
'పునర్మూల్యాంకనం'ట!
    అహింస ముందు / తలవంచక తప్పదు
    అంగుళీ మాలుడైనా
    అట్లీ ప్రభువైనా!

-సి హెచ్. వి. బృందావనరావు

బండితోవ ఉంది. ఆ వెనక చెరువు గట్టు నానుకొని బంజరుందిగదమ్మా. ఉత్తి ఇసకనేల. గడ్డి కూడా మొలవదు."

"ఇంకెక్కిడి బండితోవ. ప్రెసిడెంటు గారు వరకట్టేశారు. తన పొలంలో కలిపేసుకున్నారు."

"మరి గూడెం పిల్లలు బడికి ఎలాగొస్తున్నారమ్మా?"

"ఈ మధ్య ఊరవతల నుంచి వాళ్ళకీ మనకీ రోడ్డు పడింది గదా"

"అవును. అది పాతదే. బహుశా రోడ్డు ఎత్తుచేసి తారు వేసుంటారు."

"తారు రోడ్డు కాదు గాని కంకర రోడ్డయింది."

"అయినా అది దూరం కదమ్మా?"

"దూరం ఏవుంది. వాళ్ళ ఊర్లో రిక్షా ఎక్కుతారు, బడి దగ్గర దిగుతారు. పావుగంట పడుతుంది."

"అడ్డగా నడిచొచ్చినా అంతే అవుతుంది. అయినా ఇప్పుడు అడ్డుతోవ లేదు." నవ్వుకున్నారు రావుగారు.

"మరి చాకళ్ళు చాకిరేవు చెరువుకి ఎలాగ వెళ్తున్నారు?"

"ఎలాగంటే, ప్రెసిడెంటుగారి పొలం గట్లమీద నుంచే. ఆ మధ్యేం అయిందనుకున్నారు, చిన్నాన్నా! ప్రెసిడెంటుగారి పొలానికి నీరందలేదు. చేను పొట్టమీద ఉంది. ఇంజను పెట్టి చాకిరేవు నీరు తోడించేశారు. చాకలోళ్ళు కట్టుకట్టారు. గట్టిగా నిలదీసి అడిగారు.

మర్నాటి నుంచి గట్టుమీద కాలు పెట్టనివ్వలేదు ప్రెసిడెంటు. వాళ్ళకి చెరువుకి వెళ్ళడానికి మరొక తోవ లేదు. కాళ్ళబేరానికొచ్చారు. ఇంటికి ఐదు రూపాయలు బల్ల మామూళ్ళు వసూలుచేసి చెరువు లోతు చేసుకున్నారు."

వేడి వేడి పెసరట్లు వడ్డిస్తూ చెప్పుకుపోతోంది సరస్వతి. "తాగడానికి బిందెడు మంచినీళ్ళు తెప్పించుకుంటున్నాను కోనేటి నుంచి."

రావుగారి గ్లాసులోని నీళ్ళవైపు అనుమానంగాను, భయంగాను చూశారు. కనిపెట్టింది సరస్వతి.

"ఇవి కోనేటి నీళ్ళు కావు చిన్నాన్నా. ప్రక్కనే బోరు తీశారు. ఉదయం రెండు గంటలూ, సాయంత్రం రెండు గంటలూ నీళ్ళొస్తాయి. కరెంటు లేకపోతే అదీ ఉండదు. మనిషికొక బిందెడిస్తారు. దానికోసం వరసలో నిలబడాలి. కనీసం అరగంటైనా పట్టదా. నాకెలాగవుతుంది. ఇంటిపనీ, పత్తిపనీ. అందుకే పోతేపోయిందని మనిషినిపెట్టి తెప్పించుకుంటున్నాను. బిందెకి ముప్పై రూపాయలిస్తాను. అయినా నెలంతా

లేదు. మధ్యలో నాగా పెడుతుంది. బోరింగు దగ్గర జనం ఎక్కువుంటే చెరువు నీరు తెచ్చిస్తారు. చెప్పనైనా చెప్పదు. అలాగే పడేసి వెళ్ళిపోతుంది. చూసుకోకుండా తాగామనుకో ఒకటే వాంతులూ, విరోచనాలూ. నీళ్ళు మరిగించుకొని తాగాలి. ఈ నీళ్ళు బోరింగువే. అయినా నీ కోసం మరిగించాను.

"అమ్మాయ్! ఇల్లు అమ్మేద్దామనుకుంటున్నాను. ఎలాగూ హైదరాబాద్‌లో ఇల్లు కొనుక్కున్నాను కదా. అక్కడే ఉండిపోతాను. అబ్బాయి, అల్లుడూ అక్కడే పనిచేస్తున్నారు కదా. వాళ్ళకి దగ్గరగా ఉన్నట్లుంటుంది. ఇక్కడ రెండు, మూడు రోజులుండి వ్యవహారం చూసుకొని వెళ్ళిపోతాను. ఇరుగు పొరుగు వాళ్ళతో మాట్లాడి అలా ఊరు చూసుకొస్తాను.

రావుగారు ఒక సిగరెట్ ముట్టించి వీధిలో పడ్డారు. తెలిసిన ముఖం ఏదీ కనబడలేదు. తిన్నగా గోపాలరావు ఇంటికి వెళ్ళారు. ఆయన స్కూలుకి వెళ్ళిపోయారు. ప్రక్క ఊర్లో పనిచేస్తున్నాడు. సాయంకాలానికి గాని రాడు. అవును, ఇవాళ సోమవారం. బసవయ్య కోవెలకు వెళ్ళాలి. చాలా సంవత్సరాలు అయింది అటు వెళ్లి. తను ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నప్పుడు ప్రతి సోమవారం కోవెలకు వెళ్ళేవాడు. ఆ రోజు సూర్య కుమారి కోవెలకు వస్తుంది. ఫైనలియర్ కదా, అందుకని కోవెలకు వెళ్తున్నాడని అందరూ అనుకొనేవారు. తనకు తెలుసు ఎందుకు వెళ్తున్నదీ. టంచనుగా ప్రతి సోమవారం అదే త్రోవను అదే టైంకి కోవెలకు వెళ్లేవాడు. రావుగారి కాళ్ళు అప్రయత్నంగా ఆ త్రోవ పట్టాయి.

రోడ్డు బాగా ఉంది. సిమెంటు రోడ్డయింది. కాని చాలా ఇరుకయిపోయింది. మనిషి మనిషి తప్పుకునేందుకు వీలులేదు. పక్కకు జరిగామా నిప్పులమీద కాళ్ళు వెయ్యాలి. అబ్బా అప్పుడు ఇలాగుంటే ఎంత బాగుణ్ణు. ఆ రోజుల్లో చెప్పులు వేసుకోవడం అలవాటు తక్కువ. కోవెలకు వెళ్లేవాళ్ళు అసలు వేసుకోరు. సూర్యకుమారిని తలచుకొనే సరికి రావుగారికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కామెర్ల వ్యాధితో ఈ మధ్యనే పోయింది.

చాకలి శివుడు కావిడితో నీళ్ళు మోసుకొస్తున్నాడు. "చిన్నబాబూ! ఎప్పుడొచ్చినారేటి? బాగున్నారా?" అడిగాడు.

"ఏటిరా! ఇలాగయిపోయావు?"

"ఈ మధ్య జబ్బుపడిపోయాను బాబూ. రేవుకెళ్ల లేను. ఇదిగో నీళ్ళ కావిళ్ళు మోస్తున్నాను. ఇదిగో ఈది సివర్నున్న హోటల్లో పనిసేస్తన్నాను. అది మాత్రం తెల్లారేసరికి రేవుకెళ్ళిపోద్ది."

శివుడు తనకంటే చాలా చిన్న. ఇంటి చాకలోడు. మంచి బలంగా ఉండేవాడు.

"ఏటి రోగం?"

"పచ్చకామెర్లు బాబు."

పెద్దాస్పత్రిలో నలభై రోజులున్నాను. బతుకుతానను కోలేదు. డాక్టర్లు సెబుతారు– మన కోనేటి నీళ్ళల్లో పురుగులున్నాయని. ఈ నీళ్ళు తాగొద్దంటారు. తాగితే కామెర్లు వస్తాయట. కానీ మేం ఎలాగ సావడం, యే నీళ్ళూ తాగకుండా?"

"పంపు నీళ్ళు తాగొచ్చుకదా"

"అదేం పంపు బాబు. ఒక రోజొస్తే ఒక రోజు రాదు. కరెంటు కోత గదా. ఎనిమిది నుంచి పది వరకే ఆడుంటాడు. ఆ తరవాత కరెంటొచ్చినా ఏసీవోడు రాడు. ఆడికి ఆఫీసులో పనట. బిందెడు నీళ్ళ కోసం గంటసేపు నిలబడాలి. ఈ నీళ్ళకోసం కాసుకుంటే రేవుకెప్పుడెల్తాది అది. బాబు సావు రావాలనుంటే ఎలాగైనా వస్తాది. పదండి బాబు, జనం నిలబడిపోయినారు."

ఎదురుగా ఇద్దరాడవాళ్ళు బిందెలతో నీళ్ళు మోసుకొస్తున్నారు. రావుగారే పక్కకు తప్పుకున్నారు. తన కాళ్ళకి చెప్పులున్నాయి గదా. పర్వాలేదు.

తోవ తిన్నగా కోనేటి గట్టు వరకూ వెళ్తుంది. గట్టునానుకుని బండితోవ ఉంది. ఒకవైపు చెరువు గట్టూ, రెండోవైపు అంధవరపు వాళ్ళ యిల్లు. మధ్య మూడు లారీలు తప్పుకోగల పెద్ద తోవ. కొండరాళ్ళు తెచ్చే లారీలు ఈ తోవనే వెళ్లేవి. ఇప్పుడు అంతా డొంక. బళ్ళు కూడా నడుస్తున్నట్లు లేదు. ఆ తుప్పల వెనుక ఎవరో కూర్చున్నట్లుంది. రావుగారు తల తిప్పుకున్నారు. చెరుదు గట్టునానుకుని చిన్న రేకుల షెడ్డు ఉంది. అందులోనే వాటర్ మోటర్ ఉంది. అక్కడి నుంచే మంచినీళ్ళు తెచ్చుకుంటారు.

రావుగారి కాళ్ళు అప్రయత్నంగా ఆగిపోయాయి. అడ్డంగా ఒక డ్రైనేజి కాలువ ఉంది. లోతుగా ఉంది. సిమెంటుతో బాగా కట్టారు. చెరువు తూర్పు గట్టుకి పది గజాల ముందు సమాంతరంగా కట్టారు. పంపు హౌస్‌కి కొంచెం ముందుగా ప్రారంభం అయింది. చెరువు గట్టు వంపు తిరిగిన దగ్గర ఆగిపోయింది. అంతా మొత్తం నలభై గజాలుంటుంది.

అది ఎందుకు కట్టారో, ఎటు నీరెటు వెళ్తుందో

ఎవరికీ అర్థంకాదు. దీన్నిప్పుడు మలవిసర్జనకి వాడు కొంటున్నారు. కాలువ దాటి పది గజాలు వెళ్ళేసరికి చెరువు మెట్లు తగులుతాయి. సిమెంటు పెచ్చులు ఊడిపోయి రాళ్ళు కాళ్ళకి తగులుతున్నాయి. చెరువు గట్టుమీద ఒక గుడి కట్టారు. మెట్ల ప్రక్కనుంచి తుప్పలు దాటుకొంటూ నిప్పుల మీద అడుగెయ్యకుండా రావుగారు మెల్లగా బహుకష్టం మీద గుడి దగ్గరకు వెళ్ళారు. గుడి చుట్టూ శుభ్రంగా తుడిచారు. రెండు నందివర్ధనం చెట్లున్నాయి. మల్లెలు, మందారాలూ ఉన్నాయి. చుట్టూ కొబ్బరి చిప్పలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఆ సెంటు నేల తప్పిస్తే మిగతాదంతా అపరిశుభ్రంగా ఉంది.

రావుగారు చెరువు చూశారు. నీరు లోతుగా పచ్చబడి ఉంది. పూర్వం మండు వేసవిలో కూడా ఈ చెరువులో ఇంత తక్కువగా నీళ్ళెప్పుడూ లేవు. ఎవరో పిండం చెరువులో కలుపుతున్నారు. చెరువులో తేలుతున్న కొబ్బరి బోండాలు శవాల తలకాయల్లా ఉన్నాయి. తన చిన్నప్పుడు చూశాడు. సెగిడోళ్ళబ్బాయి చెరువులో ఈతకొడుతూ మునిగిపోయాడు. రెండు రోజుల తర్వాత శవమై తేలాడు. రావుగారికి వాంతొచ్చి నట్లయింది.

"ఏంటండీ, పూజారిగారూ, చెరువులో నీళ్ళు ఇంత తక్కువగా ఉన్నాయి? కొండబట్టి చెరువులోకి రావడం లేదా?" అడిగారు పూజారిని.

ఇటూ అటూ చూసి "ఎలాగొస్తాది బాబూ! గోర్జిలో కాలనీ కట్టేశారు. ఆ వచ్చే కొద్దీ గొప్పా నీరైనా ఇందు లోకి రాకుండా ప్రెసిడెంటుగారు తన చెరువులోకి మళ్ళించుకున్నారు. కలికాలం. ఆ నీరు రాకపోవడమే మంచిది. కాలవ పక్కన పూర్వం పొలాలుండేవి. బాగా పండేవి కూడాను. ఇప్పుడు అక్కడ ఇళ్ళు కట్టుకున్నారు. వాళ్ళందరికీ ఈ కాలవే పాయిఖానా." మెల్లగా చెవిలో ఊదాడు పూజారి.

చెరువుకి అవతల గట్టున ఎవరో ఏదో కాలుస్తు న్నారు. శవం కాలిన కంపు. మేదర్లు పందిని కాలుస్తు న్నారు. లుంగీలు పైకెత్తి కొందరు గట్టు దిగుతున్నారు. అవతల చెరువులో నీరు లేదు. రావుగారు ఇక చూడలేకపోయారు.

ప్రక్కనున్న బసవయ్య కోవెల నుంచి గంటలు వినిపిస్తున్నాయి. రావుగారు గట్టు దిగి ప్రక్కకు వెళ్ళారు. ఈ మధ్య కోవెల బాగుచేయించినట్లుంది. పూర్వపు రాతికట్టడం. ఇప్పుడు దానిమీద సిమెంటు ప్లాస్టింగు చేయించారు. కోవెల ఆవరణలోని పొగడచెట్టు చూద్దామని వెళ్ళారు. అది తన తొలి ప్రణయానికి చిహ్నం. చెట్టు లేదు. ఆ చెట్టే కాదు దాని ప్రక్కనున్న సపోటా, పనస చెట్లు కూడా లేవు. అక్కడ నవగ్రహాలు వెలిశాయి. వాటికి ఒక మంటపం కట్టారు. రావుగారు బరువైన మనస్సుతో ఇంటిముఖం పట్టారు.

❖ ❖ ❖

రావుగారికి మోర్నింగ్ వాక్ అలవాటుంది. మెల్లగా నడుస్తూ ప్రాతఃకాలపు దృశ్యాలను చూడడం అలవాటు. తువ్వాలు భుజం మీద వేసుకొని బయలుదేరారు. చెరువులో ఈత కొట్టి ఎన్నో ఏళ్ళ యింది. రంగస్వామి కోనేరైతే చాలా బాగుంటుంది. ఊరికి ఒక కిలోమీటరు దూరంలో ఉంది. దాని మధ్యలో స్తంభం కూడా ఉంది చెరువులోని నీటి మట్టం తెలుసుకోవడానికి. చెరువులో దిగడానికి రాతి పలక లతో కట్టిన మెట్లున్నాయి. రైలుబండి దిగి ఊరిలోకి వచ్చేవాళ్ళు ఆ చెరువులో స్నానంచేసి గాని వచ్చేవాళ్ళు కాదు. బాటసారుల దాహం తీర్చే ఒయాసిస్సు. దీని వెనకనే మరొక చెరువుంది వ్యవసాయ భూములకు నీళ్ళందించడానికి. దాని ప్రక్క మెరక పొలాలు. మరొక ప్రక్క కొండ. తన చిన్నప్పుడు ఆ కొండమీదికి సాయం త్రాలు స్నేహితులతో కలిసి షికారుకు వెళ్ళేవాడు. ప్రక్క బీడు భూములలో కూర్చొని, చెరువులో కడుక్కొని చీకటి పడ్డ తర్వాత ఇంటికి చేరుకునేవాళ్ళు. రావుగారు

## నిరూపణ

**కా**వ్... కావ్... మంటూ
కాకుల జంట ఊసులాడుకుంటోంది
విధి విచిత్రమైనది!
కరెంటు తీగెకు తగిలి ఓ కాకి
నేలకొరిగింది వీరసైనికుడిలా...
అప్పుడే... అటుగా వెళ్తోన్న
ఊరకుక్కకు విందు భోజనమైంది
నిస్సహాయ స్థితిలో ఉన్న మరో కాకి
అదేపనిగా 'కావ్... కావ్' అని రోదిస్తోంది
పెద్ద సంఖ్యలోనే కాకులన్నీ చుట్టుముట్టాయి
విందారగించిన కుక్కను ప్రతిఘటిస్తున్నాయి
మనుషుల్లో లేని ఐకమత్యం తమలో
ఉన్నదని నిరూపిస్తున్నాయి.

—ఈవేమన

ఒక్కసారి ఆనందంతో పొంగిపోయారు.

నాలుగు వీధులు దాటిన తరువాత బస్‌స్టాండ్ వచ్చింది. రెండు బస్సులు ఆగి ఉన్నాయి. తన చిన్న తనంలో అక్కడ ఒక పాయిఖానా ఉండేది. రాతితో కట్టారు. స్థలం గంగలవాళ్ళు ఇస్తే ఆ రెండు మూడు వీధుల వాళ్ళు చందాలు వేసుకొని ఆడవాళ్ళ మరుగు కోసం ఆ పాయిఖానా కట్టుకున్నారని తన తాత చెప్పగా విన్నారు రావుగారు. పదిహేను సంవత్సరాల క్రితం తను వచ్చేటప్పటికి దాని ప్రక్కన. మరొక మరుగుదొడ్డి ఉండేది. దానిని గ్రామ పంచాయతీ కట్టించింది. సిమ్మెంటు ప్లాస్టింగుతో చక్కగా ఉండేది. ఆ వెనుక పూడిక తుప్పలు.

కొత్తగా ఈ బస్‌స్టాండు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ వాళ్ళు. పాయిఖానాలు ఉన్న స్థలంలో చిన్న చిన్న బడ్డీలు కూడా పదిదాకా వెలిశాయి. బస్‌స్టాండులో ఇంకా జనసంచారం లేదు. ఖాళీ చెంబులతో వస్తున్నవాళ్ళు రావుగారికి ఎదురయారు. బస్టాంటు దాటిన తరువాత ఒక కాలనీ ఉంది. అక్కడ ఒక మామిడితోట ఉండేది. చుట్టూ కొబ్బరి చెట్లు, తాటిచెట్లు ఉండేవి. మధ్యలో ఒక దిగుడుబావి, దాని గట్టుమీద ఒక మండపం. ఇప్పుడు అక్కడ వీకర్ సెక్షన్ వాళ్ళకి కాలనీ కట్టారు. ఒక వరండా, ఒక గది, ఒక వంటగది. కాలనీ మూడు వాసల్లో ఉంది. వాళ్ళందరికీ సైడు కాలువే పెద్ద మరుగుదొడ్డి.

రోడ్డు మలుపు తిరిగి హైవే మీదకి వచ్చారు. తారు రోడ్డు. హాయిగా ప్రాతఃకాలపు వాయువులు పీల్చు కుంటూ ఒక కిలోమీటరు నడచి రంగస్వామి కోనేరు చేరుకొన్నారు. నీరు చాలా తక్కువగా ఉంది. తాగడానికి పనికిరావు. స్తంభం విరిగిపోయింది. మధ్యలో రాతి చప్టా కనిపిస్తుంది. చెరువులో దిగడానికి మెట్లు లేవు. అక్కడక్కడ రాళ్లు మాత్రం కనిపిస్తున్నాయి. ప్రక్కనే ఒక పురిపాక ఉంది. అది అప్పారావు టీకొట్టు. మట్టితో కట్టినా దాని గోడలకు నున్నగా ఉన్న పలకరాళ్లు న్నాయి. మనిషి ఎంత స్వార్థపరుడు అని రావుగారు నవ్వుకున్నారు. టీకొట్టు ప్రక్క నుయ్యి ఉంది. అప్పారావే తవ్వించుకున్నాడు. టిఫిన్‌తో పాటు నీళ్ళిస్తాడు. టీ తాగుతామన్నా కూడా నీళ్ళిస్తాడు. కోనేటి నీళ్ళు కొబ్బరి నీళ్ళలా తియ్యగా ఉండేవి.

కోనేటి ప్రక్క చెరువు లేదు. ఎవరో వరకట్టేశారు. అర ఎకరం పొలం. పల్లం. దాని వెనుక ఉండే కొండ ఊహించుకోడానికి కూడా లేదు. అక్కడ స్టోన్ క్రషర్ ఉంది. రావుగారికి కడుపు గుడగుడలాడుతుంది. బలవంతంగా ఆపుకొంటున్నారు. కోనేటికి కొంచెం దూరంలో మొండిగోడలు కనిపిస్తున్నాయి. సగంలో ఆగిపోయిన కాలనీ అది. వాటి వెనుక ఎవరో కూర్చొని ఉన్నారు. ఆడవాళ్ళయి ఉంటారు అనుకున్నారు రావుగారు. ఇంక ఇక్కడ లాభంలేదనుకొని అడ్డత్రోవన పొలాల మధ్య నుంచి ఊళ్ళోకి బయలుదేరారు రావుగారు. ఈ పొలాలు దాటితే కాటి చెరువు తగులు తుంది. అది పదిహేనెకరాల స్థలం. నీరు మాత్రం తక్కువగానే ఉంటుంది. వేసవిలో కూడా ఎండిపోదు. చెరువు గట్టు మీదికి వచ్చారు. చెరువులో కొద్దిగా నీరుంది. ఒక ప్రక్క పెంకుటిళ్ళు, చిన్న చిన్న దాబాలు. మరొక ప్రక్క ఒక పెద్ద బిల్డింగు. ఇదంతా ఒకప్పుడు పచ్చిక బీడు. ఆవులు మేపుకొనేచోటు. ఆవులు ఇప్పుడు

అవస్థ

కథా నిలయం
శ్రీకాకుళం

అమావాస్య [illegible]టిలో
ఆకాశాన్ని తిలకిస్తుంటే
చుక్కలన్నీ ఒక్కసారిగా
వెక్కిరిస్తున్న అనుభూతి
[illegible]ంచపు కన్నుల్లో
మనస్సు ఇరుక[illegible]
తాళ్ళ వలయాన్ని
తప్పించుకోలేక
నిర్వీర్యమౌతున్నప్పుడు
కుప్పలు తెప్పలుగా
ఒళ్ళంతా తూట్లు పొడిచే
నల్లుల బెడద
వయసుడిగిన సాయంకాలంలో
అమ్ములు రొమ్మున నాటుతుంటే
కూడపెట్టిన కూటి కోసం
పోటీకి పొట్లుపడే బంధుజనం
వక్రీకరించిన కాల గమనంలో
కలుషితమైన వరదల్లోంచి
జీవన నావ పయనిస్తుంటే
తీరం చూపె దృష్టిమాని
ధారకు త్రోసే లోకంలో
సాత్వికత సమసిపోతూనే ఉంది.

-వూట్ల భద్రయ్య

మేతకు ఎక్కడికి వెళ్తున్నాయో? ఒకప్పుడు ఆ చుట్టుపక్కల జనావనికి ఇదే బహిర్భూమి. అక్కడ కూర్చొనే వీలులేదని రావుగారు గ్రహించారు. ఇక్కడివాళ్ళు తెల్లారేసరికి ఎక్కడకి వెళ్తారు? తను నిన్న రిక్షాలో ఊళ్ళోకి వస్తున్నప్పుడు ముక్కుకు తగిలిన వాసన, లేత వెలుగులో రోడ్డు ప్రక్కన కూర్చొన్న జనాలు గుర్తుకొచ్చారు. రావుగారి మనస్సు వ్యాకుల పడింది. దానితో ఇప్పటి తన అవసరం కూడా తీరిపోయింది.

పెంకుటిళ్ళ మధ్య నుంచి నడుస్తున్న రావుగారికి రామయ్య పిలుపు వినిపించింది. గవర్నమెంటు తనకి ఇక్కడ పట్టా ఇచ్చారట. ఇల్లు కట్టుకుని ఉంటున్నాడు. మూడు వాసల్లో ఇల్లు. పూర్వం అన్ని కాలాల్లోను ఊరి వారందరికీ అదే బహిర్భూమి. పశువులకు పచ్చిక బీడు. ఇప్పుడు అక్కడ అన్నీ ఇళ్ళే. శవాల్ని పాతిపెట్టే చోట బిల్డింగులు లేచాయి. చెరువుకి ఒక మూల చిన్న డొంక ఉంది. ఆ డొంకల మధ్య జాగాని ఎవరో శుభ్రం చేస్తున్నారు. అక్కడేం చేస్తున్నారని అడిగితే నారావారి వీథిలో ఎవరో చచ్చిపోయారు. ఆ శవాన్ని దహనం చేయడం కోసం అక్కడున్న బూడిదని తీసి పక్కన పారబోస్తున్నారని చెప్పాడు రామయ్య. ఆ డొంక వెనక చుట్ట కాలుస్తూ ఎవరో కూర్చొన్నారు. ఇంత పెద్ద శ్మశానంలో ఈ రోజున రెండు శవాల్ని కాల్చడానికి కూడా చోటులేదు. పూర్వం శవాల్ని కాల్చేచోట ఫైర్ స్టేషన్ వెలిసింది.

రావుగారు గబగబా ఇంటికి వచ్చి స్నానం చేశారు. సరస్వతి పూరీలు చేసింది. రావుగారు రెండు పూరీలు మాత్రం తిని చెయ్యి కడుక్కున్నారు. సరస్వతి ఆశ్చర్య పోయింది. "నువ్వేం అనుకోకమ్మా! నాకీ పూట ఆకలిగా లేదు. టీ తీసుకురా."

"సరే, మీ ఇష్టం"

రావుగారు టీ తాగుతూ "అమ్మాయ్! విశాఖ రెండు గంటలకి కదా వస్తుంది. నేను దానికి వెళ్ళిపోతాను. తొందరగా వంట చెయ్యి."

"అదేంటి చిన్నాన్నా? రెండు రోజులుంటామన్నారు కదా? రాక రాక వచ్చారు. వారం రోజులుంటే బాగుం టుంది. అసలు వచ్చినట్లే అనిపించడంలేదు. మరి ఇంటి సంగతి ఏం చేశారు? మళ్ళీ మీరు ఎప్పుడోగాని రారు."

"అమ్మాయ్ ఇల్లు అమ్మను. రెండు సంవత్సరాలలో రిటైరవుతాను. ఆ తర్వాత ఇక్కడికే వచ్చేస్తాను. ఇక్కడే మన ఊళ్ళోనే ఉంటాను. ఎక్కడెక్కడో తిరిగాను. ఎన్నో ఊళ్ళు చూశాను. నా ఊరు కూడా చూడాలి గదా?"

సూట్‌కేస్ సర్దుకొంటూ, "అమ్మాయ్ ఇలా రా. ఇదిగో నేను చెప్తున్నాను. జాగ్రత్తగా విను. అద్దె డబ్బులు నాకు పంపొద్దు. నువ్వు తీసుకో. మారుమాట చెప్పకు. ఇదిగో ఈ ఐదువేలూ నీ దగ్గరుంచు. రెండిళ్ళకీ కలిపి సెప్టిక్ లావెట్రి కట్టించు. నీ జాగాలోనే. నీకైతే పంచా యతీ వాళ్ళు సబ్సిడీ ఇస్తారు. ఇది చాలకపోతే మళ్ళీ పంపుతాను. ఇప్పుడే పంచాయతీ ఆఫీసుకు వెళ్ళి ఈవో గారితో మాట్లాడి వస్తాను" అంటూ సిగరెట్టు ముట్టించు కొని వీథిలోకి వచ్చాడు రావుగారు.

పన్నెండు గంటలకి ఆదరా బాదరాగా ఇంటి కొచ్చిన రావుగారు చెంబుతో నీళ్ళు పట్టుకొని పరుగు లాంటి నడకతో మండుటెండలో చెరువుకి బయలు దేరారు. ఎంత వేగంగా నడిచినా దూరం తరగడం లేదు. ఇటూ అటూ చూశారు. జనసంచారం లేదు. రావుగారు రోడ్డు ప్రక్కన కాలువ మీద ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చొని ఎండకి తాళలేనట్లు తువ్వాలు తలపై నుంచి ముఖం మీదికి కప్పుకున్నారు. హమ్మయ్య ఎవరూ చూడలేదు అనుకుంటూ ఇంటి ముఖం పట్టారు. దించిన ముఖాన్ని ఇంటి గుమ్మం ముందే పైకెత్తారు. సిగరెట్టు వెలిగించి హాయిగా పొగ పీల్చుకున్నారు. ■

## యుగకర్త

సింగారం, శృంగారం అంగాంగాన
విరజిమ్మే సుందరాంగుడు శేషేంద్ర
కవిత, భావుకత పలుకు పలుకున
వొలికించే కవిచంద్రుడు శేషేంద్ర
అభిమానం, అహంభావం కలగలిపిన
మానవతా సింధూరం శేషేంద్ర
నిదురించే తోటలోకి పాటలాగా వచ్చి
ఆమనికి వోణి వేసిన వసంతుడు శేషేంద్ర
వేదాల నుండి ఆధునిక వాదాల దాక
సాహితీ నాదాలు పలికించిన వ్యాసుడు శేషేంద్ర
కామోత్సవ్ నుండి ప్రజల కర్మోత్సవ్ దాక
క్రోధాగ్నులు వుమిసిన మార్తాండుడు శేషేంద్ర
బహుభాషాకోవిదుడై తెలుగు భాషా యోషను
విదేశీ వేదికలపై ప్రతిష్ఠించిన యుగకర్త శేషేంద్ర

**-పి. పాపిరెడ్డి**